సాక్షి నంద్యాల

సోమవారం । 19 । మే । 2025



మల్లన్నకు నృత్య నివేదన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై ఆదివారం హైదరాబాద్‌కు చెందిన నటరాజ నృత్యనికేతన్ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్

జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జేఈఈ మెయిన్స్ మొదటి, రెండో విడతల్లో అర్హత పొందిన విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 8లో▸



ఉరిమిన వరుణుడు!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జోరుగా వర్షం కురిసింది. కొన్ని చోట్ల రోడ్లు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. 8లో▸

న్యూస్‌రీల్

ఓంకారేశ్వరుడి సేవలో జిల్లా జడ్జి



జడ్జి దంపతులను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

బండి ఆత్మకూరు: నల్లమల అడవిలో వెలసిన గంగ ఉమా సమేత ఓంకారేశ్వర స్వామిని ఆదివారం కర్నూలు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మల్లీశ్వరి దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ నాగప్రసాద్ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం పండితులు ఆశీర్వదించగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగప్రసాద్, ప్రొటోకాల్ ఆఫీసర్ నరేష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

- 39 పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో సోమవారం నుంచి 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. హాల్ టికెట్లను డీజీఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకుని, నేరుగా పరీక్షలకు హాజరు కావచ్చు. 19వ తేదీ నుంచి 28 వరకు జరగనున్న ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 5,260 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 39 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల విధులకు 39 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులతో సహా 300 మంది ఇన్విజిలేటర్లను విద్యాశాఖాధికారులు నియమించారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ఆర్టీసీ డిపో నుంచి సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ గంగాధర్‌రావు ఆదివారం తెలిపారు. ఈనెల 15న ప్రారంభమైన పుష్కరాలు 26వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. నంద్యాల నుంచి అధునాతన సూపర్ లగ్జరీ బస్సు తెలంగాణలోని కాళేశ్వరం వరకు నడుపుతున్నామని, అక్కడ పుణ్య స్నానాలు ఆచరించి మహాకాళేశ్వరుని దర్శనం, రామప్ప దేవాలయం, వరంగల్, వెయ్యిస్తంభాల మండపం, భద్రకాళి దర్శనం, ధర్మపురిలో స్నానాలు, లక్ష్మీనరసింహస్వామి దర్శనం, కొండగట్టు ఆంజనేయస్వామి, వేములవాడ క్షేత్ర దర్శనం, అనంతరం హైదరాబాద్ మీదుగా నంద్యాలకు చేరుతుందన్నారు. ప్రయాణికులు సమూహంగా 30 మంది వస్తే ప్రత్యేక బస్సు పంపుతామని తెలిపారు. ఒక్కొక్కరికి రానుపోను రూ.2,400 అవుతుందన్నారు. వివరాలకు 7382873615, 9505065651ను సంప్రదించాలన్నారు.

వాహనాల తనిఖీ ముమ్మరం

బొమ్మలసత్రం: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లాలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామని జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రధాన పట్టణాలతో పాటు జాతీయ రహదారులపై వాహనాలను తనిఖీ చేస్తున్నామని వివరించారు. ఇదే కాకుండా అన్ని ప్రాంతాల్లో చోరీలు, అల్లర్లు, దారి దోపిడీలు జరగకుండా నిరంతర గస్తీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పట్టణ శివార్లలో నిర్మానుష్య ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి కోసం డ్రోన్‌లతో నిఘా ఉంచామని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే వారి ఫింగర్‌ప్రింట్లు సేకరించి వివరాలు నమోదు చేయటం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అనిన ప్రాంతాల్లో డ్రంకన్ అండ్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరం చేశామన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కూలీలను తరలించే ఆటోలు పరిమితికి మించి నడిపి వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

శ్రీమఠంలో భక్తుల రద్దీ



మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో కర్ణాటక, తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. తుంగభద్ర నదీతీరం, మధ్వద్వారం వద్ద భక్తుల కోలాహలం కనిపించింది. భక్తుల రద్దీతో రాఘవేంద్రుల మూల బృందావనం దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాదం కౌంటర్ల వద్ద భక్తులు బారులు తీరారు. భక్తుల సందడితో శ్రీమఠం ప్రాంతం కళకళలాడింది.

గోకులం ఊరించి.. అప్పులు వెక్కిరించి!

బిల్లులు ఇవ్వండి 'బాబూ'

- లబోదిబోమంటున్న గోకులం లబ్ధిదారులు
- అప్పులు తీసుకొచ్చి నిర్మాణాలు
- అధిక శాతం షెడ్లు టీడీపీ కార్యకర్తలకే..
- పూర్తయిన నిర్మాణాలకు అందని బిల్లులు
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు

ఆరు పశువుల షెడ్ యూనిట్ కాస్ట్ రూ.2.30 లక్షలు కాగా.. ఇందులో 90 శాతం ఉపాధి నిధుల కింద చెల్లిస్తారు. 10 శాతం లబ్ధిదారుల వాటా. ఏదో రకంగా షెడ్ నిర్మాణం మమ అనిపిస్తే బిల్లు వచ్చేస్తుంది అనుకున్నారు. కనీసం రూ.లక్ష వరకు ఆదాయం ఉండకపోతుందా అని అప్పులు తెచ్చి షెడ్ల నిర్మాణం చేపట్టారు. తీరా చూస్తే బిల్లుల ఊసే లేకపోవడంతో షెడ్లను దక్కించుకున్న 'తమ్ముళ్ల'కు అప్పులు వెక్కిరిస్తున్నాయి.



నంద్యాల జిల్లాలో నిర్మించిన పశువుల షెడ్డు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పశువుల షెడ్లు(గోకులం) టీడీపీ కార్యకర్తలే దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో నగదు చేతిలో లేకపోయినప్పటికీ అప్పులు తెచ్చి షెడ్లు నిర్మించుకున్నారు. బిల్లులు వస్తే వెంటనే అప్పులు చెల్లించవచ్చనే ఉద్దేశంతో నిర్మాణాలకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం షెడ్లు నిర్మించుకొని నెలలు గడుస్తున్నా బిల్లుల ఊసే లేకపోవడంతో షెడ్లు మంజూరైన సంతోషం ఆవిరైపోయింది. బిల్లులు ఎప్పుడు ఇస్తారంటూ లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయాలు, ఏపీవోలు, ఈసీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 2024 జూన్ నెలలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నెల రోజుల్లోపే టీడీపీ కార్యకర్తలు, మండల, గ్రామస్థాయి నేతలకు ఉపాధి నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్స్ నిర్మాణాల ద్వారా సంపాదించుకునే అవకాశం కల్పించింది. కూటమి పార్టీల కార్యకర్తలు పశువుల షెడ్ల కోసం పోటీపడ్డారు. సంబంధిత టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజక వర్గాల ఇన్‌చార్జీలు సిఫారసులతోనే జిల్లా యంత్రాంగం వీటిని మంజూరు చేసింది. పశువులతో పాటు గొర్రెలు, మేకలు, కోళ్లకు కూడా ఉపాధి నిధులతో షెడ్లు నిర్మించుకునే అవకాశం కల్పించారు. అయితే ఆరు పశువులు షెడ్లకు యూనిట్ కాస్ట్, సబ్సిడీ ఎక్కువగా ఉండటంతో వీటిపైనే దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

> కర్నూలు జిల్లా కౌతాళం మండలానికి 59 షెడ్లకు పరిపాలన అనుమతులు లభించాయి. ఇందులో 54 షెడ్ల పనులు మొదలయ్యాయి. ఈ మండలానికి చెందిన ఉపాధి సిబ్బంది ఒకరు వ్యాపారిగా మారి మెటీరియల్ తన వద్దే తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. లేదంటే బిల్లు ఎప్పుడు వస్తుందో చెప్పలేమని చెబుతున్నట్లు సమాచారం. అయితే మార్కెట్ ధరల కంటే 10 నుంచి 20 శాతం అధిక ధరలకు మెటీరియల్ ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. షెడ్ల పనులు పూర్తయిన తర్వాత ఉపాధి సిబ్బంది బిల్లు చేస్తారు. ఆ సందర్భంలోనే కమీషన్ రాబట్టుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది.
>
> .. ఇదే తరహాలో చాలా మండలాల్లో ఉపాధి సిబ్బంది వ్యాపారులుగా మారి మెటీరియల్ సరఫరా చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి జిల్లాకు 2,108 షెడ్లు మంజూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మెటీరియల్ కాంపోనెంటు కింద 2024–25 సంవత్సరానికి కర్నూలు జిల్లాకు రూ.28.84 కోట్లతో 1,254, నంద్యాల జిల్లాకు రూ.18.96 కోట్లతో 854 షెడ్లు చొప్పున ఉమ్మడి జిల్లాకు 2,050 షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యాలను ఇచ్చింది. షెడ్లు మంజూరు కావాలంటే విధిగా పశువులు ఉండాలి. కానీ టీడీపీ నేతల సిఫారసుల కారణంగా పశువులు లేని వారికి కూడా షెడ్లు మంజూరు కావడం గమనార్హం. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు నిజమైన రైతులు, పశుపోషకుల నోళ్లలో మట్టి కొట్టారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిలిచిపోయిన షెడ్ల పనులు

పశువుల షెడ్లు నిర్మించుకున్న వారికి ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించకపోవడంతో షెడ్ల నిర్మాణాల్లో పురోగతి లోపించింది. అప్పులు తెచ్చి షెడ్లు నిర్మిస్తే బిల్లు వస్తుందో, రాదోనన్న అనుమానాలు నెలకొన్నాయి. బిల్లులు ఎప్పుడు వస్తాయనేది అధికారులకు కూడా తెలియక సత్వరం షెడ్ల పనులు పూర్తి చేయాలని గట్టిగా చెప్పలేకపోతున్నట్లు తెలుస్తోంది. పల్లె పండుగలో భాగంగా ఉపాధి నిధులతో సీసీ రోడ్లు కూడా నిర్మించారు. దాదాపు పనులన్నీ పూర్తయ్యాయి. వీటికి సంబంధించిన బిల్లులు కూడా అతీగతీ లేకపోవడం గమనార్హం. పశువుల షెడ్లు కార్యకర్తలకు ఇవ్వగా.. సీసీ రోడ్లు కూటమి పార్టీల నేతలకు కేటాయించారు. అయితే బిల్లులు అందక వీరి పరిస్థితి కక్కలేక, మింగలేక అన్నట్లుగా ఉంది.

- కర్నూలు జిల్లాకు 1,254 షెడ్లు మంజూరయ్యాయి. 752 పూర్తి కాగా.. 252 వివిధ దశల్లో ఉన్నాయి. బిల్లుల సమస్యతో పనులు మందగించాయి. 250 షెడ్ల పనులు మొదలే కాకపోవడం గమనార్హం.
- నంద్యాల జిల్లాకు 854 మంజూరు కాగా.. 517 పూర్తయ్యాయి. 311 షెడ్ల పనులు మొదలైనా బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఇప్పటికీ 26 షెడ్ల పనులు మొదలే కాని పరిస్థితి.

ఒక్క షెడ్డుకూ బిల్లు ఇవ్వని వైనం

- పల్లె పండుగ పేరుతో షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభించడంలో కూటమి ప్రభుత్వం చేసిన హడావుడి అంతా ఇంతా కాదు.
- ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 752, నంద్యాల జిల్లాలో 517 షెడ్ల పనులు పూర్తయినప్పటికీ ఒక్కరంటే ఒక్కరికి కూడా బిల్లు చెల్లించని పరిస్థితి.
- 2024–25 ఆర్థిక సంవత్సరం ముగిసింది. 2025–26 ఆర్థిక సంవత్సరం మొదలై నెలన్నర రోజులవుతోంది. అయినప్పటికీ బిల్లుల ఊసే కరువైంది.
- ఉపాధి నిధులను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇతర పనులకు మళ్లిస్తోంది.
- ఈ నేపథ్యంలో షెడ్ల నిర్మాణానికి బిల్లులు ఇప్పట్లో విడుదలయ్యే పరిస్థితి లేదని తెలుస్తోంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పశువుల షెడ్లు(గోకులాలు), సీసీ రోడ్ల బిల్లుల విషయపై ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నాం. సీసీ రోడ్ల పనులు దాదాపు పూర్తయ్యాయి. పశువుల షెడ్లలో కూడా 80 శాతం పూర్తి చేశారు. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. బిల్లుల విషయపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉంది.

– వెంకటరమణయ్య, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

త్రివిధ దళాలకు తిరంగా వందనం



పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావం తెలుపుతూ నంద్యాల పట్టణంలో ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక టెక్కె మార్కెట్ యార్డ్ నుండి గాంధీ చౌక్ వరకు నిర్వహించిన భారీ తిరంగా ర్యాలీలో జిల్లా కలెక్టర్ రాజకుమారితో పాటు నంద్యాల పార్లమెంటు సభ్యులు బైరెడ్డి శబరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశరక్షణకు సరిహద్దుల్లో శత్రు దేశాలత నిరంతరం పోరాడే మన సైనికులకు మనమందరం సంఘీభావం తెలపాలన్నారు. ర్యాలీలో బోలో భారత్ మాతాకీ జై.. ఉగ్రవాదులు నశించాలి.. భారతీయుల ఐక్యత వర్ధిల్లాలి.. నినాదాలు హోరెత్తాయి. మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న సైనికులు, మాజీ సైనికులను సన్మానించారు. ర్యాలీలో మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షుడు ముస్తాక్ అహమ్మద్, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, దూదేకుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ బాబన్, సెంట్రల్ సివిల్ సప్లయ్ కమిటీ డైరెక్టర్ నరహరి విశ్వనాథరెడ్డి, ఎన్‌సీసీ విద్యార్థులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి

గోస్పాడు: ఎయిడ్స్ బాధితులలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా ఏఆర్‌టీ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, ఎయిడ్స్, లెప్రసీ, టీబీ జిల్లా కార్యాలయ వైద్య అధికారి డాక్టర్ తేజస్విని అన్నారు. స్థానిక సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆదివారం రాత్రి అంతర్జాతీయ ఎయిడ్స్ మృతుల స్మారక దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏటా మే నెల మూడో ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 4,841 మంది ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్న బాధితులు ఉన్నారని తెలిపారు.



కొవ్వొత్తులతో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ర్యాలీ చేస్తున్న దృశ్యం

కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కాంతారావు నాయక్, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్లు నోసిన్, దేవి శంకర్, జుబేర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యను నిర్వీర్యం చేయొద్దు

కోవెలకుంట్ల: సంస్కరణల పేరుతో పాఠశాల విద్యారంగాన్ని నిర్వీర్యం చేయవద్దని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి అన్నారు. ఆదివారం కోవెలకుంట్ల పట్టణంలోఎస్టీయూ ప్రాంతీయ సమావేశాన్ని ఆ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు శివప్రసాదరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల భిన్న అభిప్రాయాలపై సమీక్ష చేయకుండా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయ సంఘాల ఏకాభిప్రాయం ప్రకారమే విద్యారంగంలో సంస్కరణలు చేపట్టామని అధికారులు, ప్రజా ప్రతినిధులు వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కొత్త పాఠశాలల ఏర్పాటు, బదిలీల అసంబద్ధ నిర్ణయాలకు నిరసనగా ఈ నెల 21వ తేదీన ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అన్ని జిల్లాల డీఈఓ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం నిర్వహించ తలపెట్టినట్లు వెల్లడించారు. ఉన్నత పాఠశాలల్లో 1:30 నిష్పత్తి ప్రకారం విద్యార్థుల సంఖ్య 45 మంది దాటితే రెండవ సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయ సంఘా లు ప్రతిపాదించిన డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో దశలవారీగా ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మౌలాలి, అజంబేగ్, కడపజిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, నాయకులు వెంకటరామిరెడ్డి, సుబ్బయ్య, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, శ్రీరామమూర్తి, మహబూబ్ వలి, ప్రసాద్, ఓబులేసు, షరీఫ్, రవికుమార్, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

శ్రీశైల దేవస్థాన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌పై వేటు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.అయ్యన్నపై వేటు పడింది. విధుల పట్ల నిర్లక్ష్యం వహించారనే కారణంతో సీఎస్‌వోను దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు సస్పెండ్ చేశారు. ఆదివారం సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 14వ తేదీన కర్నూలుకు చెందిన 15 మంది అన్యమతస్తులు శ్రీశైలం యాత్రకు వచ్చారు. శ్రీశైలం డ్యాంను సందర్శించారు. అనంత రం శ్రీశైలం పరిసర ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చారు. శ్రీశైలంలో ఓ హోటల్‌లో భోజనం చేశారు. అటు తరువాత శ్రీశైల ఆలయ పరిసరాల సమీపంలో తిరుగుతుండగా సీఎస్‌వో అయ్యన్న, సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. శ్రీశైల దేవదాయ చట్టం ప్రకారం అన్యమత గుర్తులు, వస్తువులు కలిగి ఉండి ఆలయ పరిసరాల్లో తిరగడం చట్టరీత్యా నేరమని వారికి చెప్పి, వారిని శ్రీశైలం నుంచి బయటికి పంపించారు. అయితే ఈ విషయంపై దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు విచారణ చేయించారు. అన్యమతస్తుల వాహనాన్ని టోల్‌గేట్ వద్దనే నిలిపివేయకుండా, విధుల పట్ల నిర్లక్ష్యం వహించారని దేవస్థాన ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న పర్యవేక్షకులు కె.అయ్యన్నను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేశారు. అలాగే టోల్‌గేట్ వద్ద నిర్లక్ష్యంగా విధులు నిర్వహించి అన్యమతస్తులను శ్రీశైలంలోకి అనుమతించిన ఇద్దరు హోంగార్డులను, ఇద్దరు సెక్యూరిటీ గార్డులను తాత్కాలికంగా విధుల నుంచి నిలుపుదల చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఉదయం 9.30 ప్రారంభించి మధ్యాహ్నం 12.30 గంటలకు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ 9.30 గంటల్లోగా హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుడి సేవకులు.. దేవుడిచ్చిన బంధాలు

- పల్లకీలో పెళ్లికూతురు
- 'మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత' నవ్య పథం
- సొంత మేనమామల్లా కార్యక్రమం
- బృందంలోని అమ్మాయిల పెళ్లిలో తమ వంతు శోభ
- కుటుంబ సభ్యుల్లా మెలుగుతూ సంతోషాల జల్లు
- చర్చనీయాంశంగా మారిన సంప్రదాయం

పల్లకీలోని అమ్మాయి పేరు హిమబిందు. తండ్రి ఆవులశెట్టి చంద్రశేఖరప్ప వస్త్ర దుకాణం నిర్వహిస్తుండగా, తల్లి లక్ష్మీదేవి గృహిణి. బీసీఏ పూర్తి చేసిన ఈమె 'మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత' బృందంలో సభ్యురాలు. మూడేళ్లుగా తన వంతు సేవగా ఆలయాలను శుభ్రం చేస్తున్నారు. ఈ అమ్మాయి ఎదురొచ్చి టెంకాయ కొడితే కానీ ఆ బృందం బయలుదేరుతున్న బస్సు కదలదు. అంతటి సెంటిమెంట్. పల్లకీ మోస్తున్నారంటే వాళ్లు సొంత మేనమామలు అనుకుంటే పొరపాటు. గుడి సేవ బృందంలోని సభ్యులు ఎంచుకున్న తోవ ఇది. తమతో పాటు సేవలో పాల్గొనే అమ్మాయిల పెళ్లి సందర్భంగా ఈ 'పల్లకీ సేవ' ఇంటి మనుషులుగా సొంత ఖర్చుతో నిర్వహిస్తుండటం విశేషం.



పెళ్లి కూతురును పల్లకీలో మంటపానికి తీసుకొస్తున్న మన ఊరు మనగుడి మన బాధ్యత బృందం సభ్యులు. చిత్రంలో గుంటూరు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్ రెడ్డి తదితరులు

కర్నూలు కల్చరల్: అమ్మాయిని ఓ **అయ్య చేతిలో** పెట్టాలంటే తల్లిదండ్రులకు కంటి **మీద కునుకు** ఉండదు. పెళ్లి చూపులు మొదలు.. **అప్పగింత**ల వరకు ఒకటే హడావుడి. కాంక్రీట్ వనాల్లో ఎవరికి వారుగా బతుకున్న రోజుల్లో బంధాలు, బంధుత్వాలు గుర్తుకు తెచ్చుకున్నా కళ్ల ముందు మెదలని పరిస్థితి. సొంతూళ్లకు దూరంగా, సప్త సముద్రాలకు అవతల ఉద్యోగాలు చేస్తున్న వారికి వరుసలు తెలియవు, ఉన్న ఊళ్లో ఎవరిని ఏమని పిలవాలో దిక్కుతోచదు. అలాంటిది పెళ్లి అనగానే.. **తల్లి**దండ్రుల గుండెలు బరువెక్కుతాయి. అమ్మో.. ఇంత తక్కువ సమయమా**? అనే** మాట వినపడటం సర్వ సాధారణం**. అయితే** ముక్కూమొహం తెలియని వాళ్లు, **మేమున్నామని** భరోసా కల్పిస్తే.. సొంత మేనమా**మల్లా హడావుడి** చేస్తే.. కుటుంబ సభ్యుల్లో ఒకరిలా మెలుగుతుంటే.. జీవితంలో అంతకంటే సంతోషం ఏముంటుంది. ఈ కోవకు చెందినదే 'మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత'. కార్యక్రమం చేశామా, వెళ్లిపోయామా అన్నట్లు కాకుండా.. ఈ బృందం ఓ కుటుంబంలా మెలుగుతోంది. కష్టాల్లో ఒకరికొకరు తోడుగా నిలుస్తూ.. సంతోషాలను కలిసి పంచుకుంటున్న తీరు ఎంతో స్ఫూర్తిదాయకం.

వాట్సాప్ గ్రూపులో 1,500 పైనే సభ్యులు

మొదట అరకొరగా మొదలైన మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత వాట్సాప్ గ్రూపు దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతోంది. ప్రస్తుతం ఈ గ్రూపులో 1,500 మందికి పైగానే సభ్యులు ఉన్నారు. ఎంపిక చేసుకున్న గుడి వివరాలను గ్రూపులో తెలియజేసి కార్యక్రమం నిర్వహణలో పాల్పంచుకునేందుకు ఆసక్తి కలిగిన సభ్యుల వివరాలతో జాబితా తయారు చేస్తున్నారు. ఆ తర్వాత అవసరమైన మేరకు సభ్యులకు అవకాశం కల్పిస్తున్నారు. మరో కార్యక్రమంలో మిగిలిన వారికి ఆ భాగ్యం లభిస్తోంది.

పల్లకీలో పెళ్లి కూతురు

'మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత' బృందంలో సభ్యురాలైన హిమబిందు స్వస్థలం నంద్యాల కాగా.. వివాహం ఆదివారం కర్నూలు నగరంలో నిర్వహించారు. వరుడు వీర నవీన్. బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. వివాహం సందర్భంగా బృందం సభ్యులు సుమారు 150 మంది హాజరయ్యారు. వీరు పల్లకీని తీసుకొచ్చి పెళ్లి మంటపానికి తీసుకొస్తున్న తీరుకు వివాహానికి హాజరైన అతిథులు ఆశ్చర్యచకితులయ్యారు. ఎవరికి ఎవరో అన్నట్లుగా బతుకుతున్న రోజుల్లో ఇలాంటి వాళ్లు కూడా ఉన్నారా అని చర్చించుకోవడం విశేషం.

123 దేవాలయాల్లో కార్యక్రమం

నంద్యాలలోని ప్రథమ నందీశ్వర స్వామి దేవాలయంలో మొదలైన కార్యక్రమం ఇప్పటి వరకు 123 దేవాలయాల్లో తమ సేవను విస్తరించడం విశేషం. కాశీలోని విశాలక్ష్మి గుడిలో ఏకంగా 9 రోజుల పాటు ఈ బృందం తమ కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్లుప్తంగా

క్రీడాకారులు అవకాశాలు వినియోగించుకోవాలి



రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన నెట్‌బాల్ క్రీడాకారులు

కర్నూలు (టౌన్): క్రీడాకారులు తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని మెరుగైన ఫలితాలు సాధించాలని రిటైర్డు డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు తమకు నచ్చిన క్రీడాంశంలో సాధన చేయాలన్నారు. అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నెట్ బాల్ సంఘం కార్యదర్శి సీఈఓ నాగరత్నమయ్య, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర బాబు, సాయికృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుందర్‌రాజు పాల్గొన్నారు.

మునగచెట్లు ధ్వంసం



మునగచెట్లను ధ్వంసం చేసిన దృశ్యం

రుద్రవరం: పొలం వివాదం కారణంగా పచ్చని చెట్లను నేలకూల్చారు. యల్లావత్తుల గ్రామంలో బాలరాజు అనే రైతు రెండేళ్ల క్రితం 2.50 ఎకరాల్లో మునగ చెట్లు సాగు చేశాడు. రెండు రోజుల క్రితం బాలరాజు అనారోగ్య కారణంగా ఆసుపత్రికి చేరుకున్నాడు. కాగా రైతు లేని సమయంలో అదే గ్రామానికి చెందిన కృష్ణయ్య మరో ఏడుగురితో కలిసి ట్రాక్టర్‌తో మునగ చెట్లను టిల్లర్ కొట్టి ధ్వంసం చేశారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వర ప్రసాద్ తెలిపారు. పొలం వివాదం కారణంగా మునగచెట్లను ధ్వంసం చేశారని తెలుస్తోంది.

చెట్టును ఢీకొన్న లారీ.. డ్రైవర్ మృతి

బనగానపల్లె రూరల్: పలుకూరు క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం లారీ చెట్టును ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. నందివర్గం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాతపాడు గ్రామానికి చెందిన భాస్కర్, భారతి దంపతుల కుమారుడు గౌతం (24) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ పట్టణంలోని రవ్వలకొండ ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మధ్యాహ్నం బేతంచర్ల నుంచి బనగానపల్లె వైపు లారీతో బయల్దేరాడు. పలుకూరు క్రాస్ రోడ్డు దాటిన తరువాత లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. దీంతో లారీలో ఉన్న క్లీనర్ సుబ్బయ్యకు తీవ్రగాయాలు కాగా డ్రైవర్ గౌతం అక్కడికక్కడే మృతి చెందారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.అక్కడి వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. మృతి చెందిన గౌతం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బంగారు గొలుసు అప్పగింత

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు పోగొట్టుకున్న బంగారు గొలుసును భక్తులకు భద్రంగా అప్పగించిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. నంద్యాలకు చెందిన ఎం.చంద్రశేఖర్, కుటుంబ సభ్యులు మహానందికి వచ్చారు. బయట ఉన్న చిన్న కోనేరులో స్నానమాచరిస్తుండగా బంగారు గొలుసు పోగొట్టుకున్నారు. బయటికి వచ్చిన తర్వాత గుర్తించి సిబ్బందికి చెప్పగా విషయం తెలుసుకున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి స్థానిక ఏజెన్సీ సిబ్బందితో వెతికించగా దొరికిన బంగారు గొలుసును బాధిత భక్తులకు అప్పగించడంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఉరిమిన వరుణుడు!



హాలహర్వి మండలంలో చింతకుంట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామ సమీపంలో నిలిచిపోయిన బస్సులు

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో భారీ వర్షం
- కోతకు గురైన రోడ్లు.. నేలమట్టమైన వృక్షాలు
- పలు చోట్ల రైతులకు నష్టం

కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జోరుగా వర్షం కురిసింది. హాలహర్విలో ఏకంగా 83.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. వేసవిలో ఇంత భారీ వర్షం పడటం ఇదే మొదటి సారి. పెనుగాలులతో స్తంభాలు నేలమట్టమై పలు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల రోడ్లు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షంతో ఉద్యాన పంటలకు నష్టం కలిగింది. ఆరబెట్టిన మిర్చి, ధాన్యం నీట మునిగింది. మామిడి, అరటి తోటలు దెబ్బతిన్నాయి. కర్నూలు జిల్లాలో మంత్రాలయం మినహా మండలాల్లో వర్షం కురిసింది. జిల్లా మొత్తం మీద సగటున 26.7 మి.మీ. వర్షపాతం నమోదైంది.



కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తి సమీపంలో నేలవాలిన వరి

నంద్యాల జిల్లాలో..

నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలంలో అత్యధికంగా 32.2 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వర్షపునీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రబీ సీజన్‌లో సాగు చేసిన వరి, మొక్కజొన్న, పొగాకు, మిరప పంటలకు నష్టం చేకూరింది.

మరో మూడు రోజులు వర్షాలే!

రానున్న మూడు రోజుల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లుగా వాతావరణ శాస్త్ర వేత్తలు ప్రకటించారు. ఆలూరు, చిప్పగిరి, మద్దికర, పత్తికొండ, తుగ్గలి, ఆదోని, హాలహర్వి, హొళగుంద, వెలుగోడు, శ్రీశైలం తదితర మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

నిరాశ పరిచిన సీఎం పర్యటన

- హైకోర్టు బెంచీ ఏర్పాటుపై ఒక్క మాట లేదు
- ఆడబిడ్డ నిధి ఊసే మరిచారు
- కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య



మాట్లాడుతున్న కర్నూలు మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన ప్రజలందరికీ నిరాశ మిగిల్చిందని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని మేయర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలులో హైకోర్టు బెంచీ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు ఒక్క మాట మాట్లాడలేదన్నారు. ఆడబిడ్డ నిధికి మంగళం పాడి రాష్ట్రంలో మహిళలందరినీ మోసం చేశారన్నారు. ఏడాది పాలనలో రూ.1.50 లక్షల కోట్ల అప్పు చేసిన చంద్రబాబు నాయుడు ఒక్క పథకం అమలు చేయలేదని విమర్శించారు. అసలు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించకుండా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు అంటూ మళ్లీ మోసం చేస్తున్నారన్నారు. బెల్టు షాపులను వేలం వేసి వీధుల్లో మద్యం అమ్మకాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అమరావతిలో రాజధాని నిర్మిస్తామని చంద్రబాబు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు దెబ్బకు జిందాల్ ఫ్యాక్టరీ పారిపోయింది నిజం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి పారిశ్రామిక వేత్తలు రావాలంటే భయపడుతున్నారన్నారు.

పాలనపై దృష్టి ఏదీ?

ప్రత్యర్థులపై ఉన్న శ్రద్ధను పాలనపై సీఎం చంద్రబాబు చూపించడం లేదని మేయర్ బీవై రామయ్య విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం అయ్యిందని, మహిళలకు ఇచ్చిన ఒక్క హామీ అయినా అమలు అయ్యిందా అని ప్రశ్నించారు. ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేసి భయాభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో మంత్రి లోకేష్ 'రెడ్ బుక్' రాజ్యాంగం అమలవుతోందని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేసిన ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ముఖ్య నేతలపై అక్రమ కేసులు నమోదు చేసి తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. ఎప్పుడూ ఒక్కరికే అధికారం ఉండదన్న విషయాన్ని 'కూటమి' నేతలు గుర్తుంచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో పనిచేస్తున్న పోలీసులు అత్యుత్సాహం తగ్గించుకోవాలన్నారు.

తమ్ముడి మృతితో ఆగిన అక్క పెళ్లి

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం
- పెళ్లింట అలుముకున్న విషాదం



ఆనంద్ (ఫైల్)

ఆలూరు రూరల్: అందరూ వివాహ వేడుకల్లో ఆనందంగా ఉన్నారు. మరి కొద్ది గంటల్లో కల్యాణ తంతు నిర్వహించాల్సి ఉంది. ఇంతలోనే విషాదం. వధువు తమ్ముడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో అక్క వివాహం నిలిచిపోయింది. శనివారం రాత్రి హుళేబీడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అస్పరికి చెందిన ఆనంద్ (19) మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో అతని స్నేహితులు పూర్ణచంద్ర, తిమ్మప్ప తీవ్రంగా గాయపడ్డారు. ఆదోని ఆస్పత్రిలో పూర్ణచంద్ర, కర్నూలు ఆస్పత్రిలో తిమ్మప్ప చికిత్స పొందుతున్నారు. అస్పరికి చెందిన తిమ్మన్న, శకుంతల కుమారుడు ఆనంద్.. కాగా అతని సోదరి వివాహం హొళగుంద మండలం వందవాగిలి గ్రామంలో ఆదివారం ఉదయం జరగాల్సి ఉంది. ఆనంద్, పూర్ణచంద్ర, తిమ్మప్ప గుంటూరులోని ఆర్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నారు. పూర్ణచంద్ర స్వగ్రామం ప్రకాశం జిల్లా కంభం గ్రామం కాగా తిమ్మప్పది ఆస్పరి మండలం చిగిళి గ్రామం. శనివారం రాత్రి ఆనంద్ సోదరి వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఆనంద్ మృతితో అతని సోదరి పెళ్లి ఆగిపోయింది. అక్క పెళ్లికి వచ్చి తమ్ముడి అంత్యక్రియలు చేయాల్సి వచ్చిందని బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



ఆనంద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

ఎమ్మెల్యే పరామర్శ..

ఆనంద్ మృతి బాధాకరమని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. ఆదివారం ఆయన ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆనంద్ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

యువకుడి బలవన్మరణం



ఈరన్న (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని సాయిబాబానగర్‌కు చెందిన ఈరన్న(26) కుటుంబ కలహాలతో ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు తెలిపిన వివరాలు.. ఈరన్న బేల్దారి పని చేసుకుంటూ భార్య పిల్లలను పోషించేవాడు. భార్య రేణుకతో చిన్నచిన్న గొడవలతో మనస్తాపానికి గురై గదిలో ఉయ్యాల కట్టిన చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడికి రెండేళ్ల క్రితం వివాహమయ్యిందని, 9 నెలల కుమారుడు ఉన్నాడని బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు టూటౌన్ పోలీసులు చెప్పారు.

దూదేకుల విద్యార్థుల సంక్షేమమే ధ్యేయం



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు, సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దూదేకుల విద్యార్థుల సంక్షేమమే తమకు ప్రధానమని, వారి అభివృద్ధికి పాటుపడతామని దూదేకుల నూర్‌బాషా ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నేతలు సిద్దయ్య, కన్నయ్య చెప్పారు. ఆదివారం కర్నూలులోని ఆ సంఘం సమావేశం స్థానిక బీసీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సిద్దయ్య, కార్యదర్శులు కన్నయ్య, జాతీయ అధ్యక్షుడు సుంకేసుల ఖాదర్‌బాషా మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు వారి సంక్షేమం గురించి చర్చించడంతో పాటు సంఘ కార్యకలాపాలు ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలనే విషయమై పూర్తి ప్రణాళికను చర్చించామన్నారు. రాష్ట్రంలోని దూదేకుల విద్యార్థులకు ఉన్నత విద్యకు సహాయం అందించేందుకు, ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించే విధంగా సంఘం పనిచేస్తుందన్నారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా గోకారి, మౌలాలి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.ఖాదర్‌బాషా, డి.దివాన్‌సాహెబ్, జిల్లా కోశాధికారిగా రోషన్, ఉపాధ్యక్షుడిగా బాబు సుభాన్, సలీం, సంయుక్త కార్యదర్శిగా టీచర్ ఖాసిం, షేక్షావలి, రఫి, రుకుమాన్ హుసేన్, సుభాష్ పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడిగా విద్యాసాగర్

- తీర్మానం చేసిన ఉమ్మడి జిల్లా ఎన్‌జీఓ అసోసియేషన్



తీర్మాన ప్రతిని విద్యాసాగర్‌కు అందజేస్తున్న జిల్లా ఎన్‌జీఓ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ శివారెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో తదుపరి అధ్యక్షుడిగా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఎ.విద్యాసాగర్ నియమితులు కావాలని ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఏకగ్రీవంగా తీర్మానించిందని అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి కూతురు వివాహ కార్యక్రమం కోవెలకుంట్లలో జరిగిందని, ఈ కార్యక్రమానికి హాజరైన జనరల్ సెక్రటరీ విద్యాసాగర్‌కు తీర్మానం ప్రతిని అందించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 31న ఖాళీ కానున్న జనరల్ సెక్రటరీ పోస్టును ఉమ్మడి కర్నూలు జిల్లాకు కేటాయించాలని కోరుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అసోసియేట్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న దస్తగిరిరెడ్డిని జనరల్ సెక్రటరీగా ఎంపిక చేయాలని కోరారు.ఈ నెల 31న ఏపీఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టబోతున్న విద్యాసాగర్‌ను ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి, రాష్ట్ర సహ అధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, కర్నూలు నగరశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, రామకృష్ణ, జిల్లా నాయకులు ప్రభాకర్ రెడ్డి తదితరులు ఘనంగా సత్కరించారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష



ఐయాన్ డిజిటల్ కేంద్రంలోకి పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రానికి చేరుకుంటూ..

కర్నూలు సిటీ: దేశంలో అత్యున్నత విద్యా సంస్థలైన ఐఐటీల్లో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించేందుకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. నగరంలోని నందికొట్కూరు రోడ్డులోని ఐయాన్ డిజిటల్, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో జిల్లాలో జేఈఈ మెయిన్స్ మొదటి, రెండో విడతల్లో అర్హత పొందిన విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలకు సుమారుగా 623 మంది విద్యార్థులు హాజరయ్యారు. జూన్ 2వ తేదీన తుది కీ, ఫలితాలను విడుదల చేయనున్నారు. పేపర్-1, పేపర్-2 రెండు పరీక్షలు రాసిన విద్యార్థుల ఫలితాలను మాత్రమే విడుదల చేయనున్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

34 ఏళ్ల తర్వాత..

ఆదోని సెంట్రల్: పట్టణంలోని వైఎంకే ఉన్నత పాఠశాలలో 1991-1992 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు వీరేష్, రవి కుమార్, రాఘవేంద్ర, శేఖర్, రమేష్‌తో పాటు చదువుకున్న విద్యార్థినీ, విద్యార్థులను కలుసుకున్నారు. దాదాపు 34 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మల్లికార్జున, గురులింగయ్య, అనూ ష, కరిలింగ, సర్వమంగళ, ప్రతాప్, ఎల్లప్పలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర విద్యార్థులు రమేష్, ఉరుకుందప్ప, మహాదేవ తదితరులు పాల్గొన్నారు.

నటరాజా..మన్నించు!

శ్రీశైల దేవస్థానం పరిధిలోని పాలధార-పంచధార ఎదురుగా ఏర్పాటు నటరాజు విగ్రహం అధికారుల నిర్లక్ష్యంగా కళాహీనంగా మారింది. విగ్రహం కాళ్లు, చేతులు పగుళ్లు ఇవ్వడంతో బైండింగ్ వైర్‌తో కట్టేసి మమ అనిపించారు. క్షేత్ర పరిధిలో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా కోట్లాది రూపాయలతో వివిధ పనులు చేపట్టిన దేవస్థానం అధికారులు వాటి పర్యవేక్షణను విస్మరిస్తున్నారు. చిన్న చిన్న మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో భక్తులు మండిపడుతున్నారు. - శ్రీశైలంటెంపుల్



విరిగిన చోట బైండింగ్ వైర్ చుట్టిన దృశ్యం



నటరాజ విగ్రహం

హత్య కేసులో ఒకరు అరెస్టు



నిందితుడిని అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య

ఆలూరు రూరల్: హాలహర్వి మండలం అమృతాపురం గ్రామానికి చెందిన పెద్ద వెంకటేశు హత్య కేసులో ఒకరిని (సోమన్నను) ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆలూరు సర్కిల్ కార్యాలయంలో సీఐ రవి శంకర్ రెడ్డి, హాలహర్వి, ఆలూరు ఎస్‌ఐలు చంద్ర, మహబూబ్ బాషాలతో కలసి డీఎస్పీ వెంకట రామయ్య వివరాలు వెల్లడించారు. గత నెల 25న పెద్ద వెంకటేశులును హత్య చేశారన్నారు. ఈయన వద్ద బంధువు సోమన్న రూ.2.50 లక్షలు అప్పు తీసుకున్నారని, కొన్నేళ్లకు వడ్డీతో కలిపి రూ.4 లక్షలు అయ్యిందన్నారు. అప్పు చెల్లించాలని సోమన్నపై వెంకటేశులు ఒత్తిడి తీసుకురావడంతో రూ.3 లక్షల అప్పు చెల్లించాడన్నారు. ప్రాంసరీ నోటు మళ్లీ ఇస్తానని చెప్పిన వెంకటేశులు కొన్ని రోజుల తర్వాత రూ.3 లక్షలు ఇవ్వలేదని ప్లేటు ఫిరాయించి కోర్టులో కేసు కూడా వేశాడని తెలిపారు. దీంతో సోమన్న గ్రామం వదిలి వెళ్లి అనంతపురం జిల్లా శెట్టూరు గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడన్నారు. డబ్బులు ఇవ్వాలని అమృతాపురంలోని సోమన్న పొలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకుని వెంకటేశులు సాగు చేసేవాడన్నారు. అమృతాపురం గ్రామానికి చెందిన నటరాజ గౌడ్ ద్వారా హొళగుంద మండల కేంద్రానికి చెందిన చాకలి నాగరాజు, కర్ణాటక రాష్ట్రం ఉత్తనూరుకు చెందిన భోగప్పలతో హత్య చేయడానికి సోమన్న ఒప్పందం కుదుర్చుకున్నాడన్నారు. గత నెల 25న అమృతాపురం సమీపంలో పశువులు మేపడానికి వెళ్తున్న వెంకటేశులును వేటకొడవలితో నరికి చంపారని వెల్లడించారు. హత్య కేసులో మిగిలిన ఐదుగురు నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామన్నారు.

ఏపీ ఈఏపీ సెట్‌కు 12 కేంద్రాలు

- నేటి నుంచి ఆన్‌లైన్‌లో పరీక్ష
- 27 వరకు ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు
- హాజరు కానున్న 27,081 మంది విద్యార్థులు

కర్నూలు సిటీ: ఏపీ ఈఏపీ సెట్‌కు ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్‌కు 17,862, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 9,149 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కర్నూలులో ఏర్పాటు చేసిన 9 కేంద్రాల్లో ఇంజినీరింగ్ 12,473 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ 6,320 మంది, ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ రెండు పరీక్షలకు 50 మంది హాజరుకానున్నారు. అలాగే నంద్యాలలోని 3 కేంద్రాల్లో ఇంజినీరింగ్ 5,389, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 2,829 మంది, ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ రెండు పరీక్షలకు 20 మంది హాజరుకానున్నారు.

పరీక్షల నిర్వహణ ఇలా...

- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగా ఆన్‌లైన్‌లో నేడు (సోమవారం), రేపు (మంగళవారం) నిర్వహించనున్నారు.
- ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు 21 నుంచి 27వ తేదీ వరకు జరగనున్నాయి.
- కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ఏపీ ఈఏపీ సెట్-2025ను నిర్వహిస్తోంది.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.
- విద్యార్థులు పరీక్షకు రెండు గంటల ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. నిర్దేశిత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని సెట్ కన్వీనర్ ప్రకటించారు.
- రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ మీడియంలో ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష రాయనున్న విద్యార్థులకు కర్నూలులోనే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

కర్నూలు జిల్లాలో కేంద్రాలు

ఐయాన్ డిజిటల్ జోన్ దుపాడు(కె.వి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ-లక్ష్మీపురం), ఐయాన్ డిజిటల్ జోన్(నంద్యాల చెక్ పోస్టు నుంచి నందికొట్కూరు వైపు వెళ్ళితే కుడి వైపు ఉంటుంది-సనత్‌నగర్), జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్(బి.తాండ్రపాడు-నంద్యాల రోడ్డు), జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ-వెంకాయపల్లె(నందికొట్కూరు రోడ్డు), బృందావన్ ఇనిస్టిట్యూట్-పెద్దటూకూరు(డోన్ రోడ్డు), కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్ (డోన్ రోడ్డు), డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆదోనిలోని బీమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, ఎమ్మిగనూరులోని సెయింట్‌జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీ,

నంద్యాల జిల్లాలో కేంద్రాలు

శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కాలేజీ(ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పక్కన, శ్రీనివాసనగర్), శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కాలేజీ(అటానమస్ కాలేజీ- ఎస్‌బీఐ కాలనీ), ఎస్.వి.ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ